45



## ఈ వారం కథ

పురుగులు... పురుగులు... ప్రపంచమంతా పురుగులు, మనుషులంతా పురుగులు... చూడు ఆ సైకిల్ మీద వొక పెద్ద సైజు పురుగు. అందరి మాటలూ పాడుబావిలోంచి దెయ్యం అరపుల్లా భయంకరంగా అందరూ నవ్వచ్చు. కాని యిదంతా నాకు నిజం. యీ ప్రపంచం భగవంతుడి శవంలా కంపుకొడ్తోంది.'

'నీ అనుభూతులు నాకు అర్థమౌతాయ్. వొక ముళ్ల పందిలా మీదికి దూకుతున్న ప్రపంచపు నీడలవి' అన్నాను నేను.

# ఒకడున్నాడి స్వగతం




—రాణి శివశంకర్

ఆమె యిప్పుడు ఎంత మారిపోయింది? వొకప్పుడెలా వుండేది?

నేను యీవూరు వచ్చినప్పుడల్లా ఆమెని కలుస్తాను. ఆమె సాధారణంగా అడిగే ప్రశ్న 'అతడెలా ఉన్నాడు'

నన్ను ఆ ప్రశ్న వేసిన ప్రతిసారీ అతనిలో అనేక మార్పులు వచ్చేస్తుంటాయి. ఈనాడతడు పూర్వపుపోలికలేమీ లేనంతగా మారిపోయాడు. మేం కలిసి చదువుకొనే రోజుల్లో చలం సాహిత్యాన్ని ఎంతో వుత్సాహంగా పరిచయం చేసిన ఆ స్నేహితుడు, యిప్పుడు సాహిత్యానికే దూరంగా బతుకుతున్నాడు రొటీన్‌గా 'ఏంచదువుతాంలే? నేనుబతకాలి. కుటుంబాన్ని బతికించాలి' అంతే యీ మాటలు ఆ స్వాప్నికుడివేనా? ఉద్యోగం కోసం లంచమిస్తే మోసం చేశారు. సంసార పోషణ కోసం మార్గాలని వెతుక్కోడంలోనే అతని కాలం గడిచిపోతోంది. అతని కళ్లలో పూర్వపు జీవం ఏది? ఆ వుత్సాహం ఎక్కడికి ఎగిరిపోయింది? అతడెలా వున్నాడంటే యేం చెప్పను?

నేనూ నా నీడా నడుస్తున్నామంత సన్నిహితంగా సహజంగా నడుస్తుంటూ వెన్నెల గోదారి మీద ఆమెతో కలసి యింక ఆమె మాటల ప్రవాహం ఆ గాలితో బాటు, యిద్దరూ యిసుక తిన్నె మీదనిలబడి వొంటరి పడవవైపు చూడడం, గాలిలో అలలైన ముంగురుల్ని అతడు వేలి కొసలతో తాకడం, యెండే వెన్నెలగా షికార్లు, తామిద్దరూ తప్ప మరేదీ వాస్తవం కాదన్నంత వుద్విగ్న క్షణాలూ, అనాటి స్వప్నాలూ అన్నిటి గురించీ పలవరిస్తుంది, స్మృతులలో కూరుకుపోతూ, వూపిరాడక రొప్పుతూ, 'అంతా ఐపోయింది. పెళ్ళితో. యిదో జీవితం. యిదీ బాగానే వుంది చలికాలంలో రగ్గులోకి ముడుచుకుపోడంలా' వొకొక్కసారి గతంలోకి వెనక్కి వెనక్కి వెళ్ళిపోతుంది. 'ఆ రోజులు ఎంత బాగుండేవి?' అని ఆమె పలవరించినప్పుడు వెన్నెల కూడా వెనక్కి మళ్లి బాల్యం మీద పరచుకొంటుంది. 'సుబ్బీ గొబ్బెమ్మా సుబ్బణ్ణియ్యవే చేమంతి పూవంటి చెల్లెల్నియ్యవే మొగలి పూవంటి మొగుణ్ణియ్యవే ఏపూలూ లేవు. అంతా కాగితం పూలు' ఫక్కున నవ్వు. గొబ్బెమ్మల చుట్టూ పాడుతూ గంతులు, సీతాకోక చిలుక రెక్కల్తో పరికిణీకి మట్టి అంటుకున్నా లెక్క చేయకుండ బురదలోంచి చేలల్లోంచి ప్రభల వెంట పరుగులు. అమ్మవారి తీర్థం రోజుల్లో యింట్లో వద్దన్నా ఆసాదుల్తో పాటు గంతులు, బొమ్మల పెళ్లిళ్ళు, అందమైన ఎంబ్రాయిడరీలు తయారు చెయ్యడం, బడిలో స్నేహితుల్తో ఆటలూ పాటలూ. బాల్యం చాలా అందమైందే కానీ...' నిట్టూర్పుతో అద్దం మసకబారింది. 'అమ్మకి రోగాలు, అక్కకి భూతవైద్యాలు, చిన్నతనంలోనే మీద పడిన యింటి పని, కుంటుపడిన చదువు, కుటుంబ బాధ్యతలు పట్టని ఛాదస్తం తండ్రి అంతా పైపైన పులిమిన రంగుల్తప్ప ఏమీలేదు.

'కానీ ప్రథమ యౌవనం...' మూల్గాను.

'ఔను ప్రేమ. ఆ భావన ఎంత మధురం? ఎదురు చూపులు, ప్రేమ లేఖలు, ఎగసిపడే తరంగాలు, ప్రతిపాట మాట కొత్తగా వినిపించడం, శిలలుకూడా మంచులా కరిగిపోవడం, ఆకాశం నక్షత్రాల్తో భూమికి దిగడం, గాలి తెరలు మనకోసమే వీచడం, ఓహ్ అదంతా అద్భుతం. చివరికంతా బూడిద, మన్మధుడి చితాభస్మం. యిక్కడ ప్రేమ లేదు. సెక్సు లేదు. సౌందర్యం లేదు కానీ అన్నీ వున్నాయి ముడుచుకు పోతూ క్షీణావస్థలో.' . . . . . .

మా వారికి ప్రేమలేఖలు దొరికిపోయాయి' అందామె వొణికిపోతూ నాతో.

'వాటినెక్కడ దాచావ్?'

'లోపల లోలోపల పెట్టెలో...' భయం ఆమెని చిగురుటాకులా వణికించేస్తోంది. ఆ చల్లని గోదారి గాలిలో కూడా ఆమెకి ముచ్చెమటలు.

'ఏమని చెప్పావ్?'

'అవి వుత్తరాలు కావని వొక ఫ్రెండ్ చేసిన రచనలని...'

'నమ్మాడా?'

'ఏమో మౌనంగా వుండిపోయాడు ప్రస్తుతానికి. నమ్మితే నమ్ముండచ్చు. వుత్తరాలంటే క్షేమ సమాచారాలూ మామూలు సంగతులూ అని తప్ప హృదయపు గుసగుసలని ఆయనకేం తెలుసు? ఆయన వుత్తరాలన్నీ స్వయంగా టైపుచేసే ఆఫీసు లెటర్లలాగే వుంటాయి, నాకు రాసేవి కూడా. ఐనా మగాడినని పవిత్ర కులంవాడిననే అహంకారమే అతని సారం. ఊరంతా తిరిగి రాత్రి 10 గంటలకి యింటికి వస్తాడు. ఎన్నో వ్యవహారాలు నేను తప్ప అన్నీ ముఖ్యమే. ఎంతో మంది స్త్రీలతో వున్న సంబంధాలని గర్వంగా నా పక్కలో జేరి మరీ చెప్తాడు. ఇల్లాలికి మాత్రం స్వేచ్ఛ పనికి రాదంటాడు' తర్వాత భయం భయంగా గుసగుసలాడింది ఆ చీకట్లో 'నన్ను వదిలేస్తాడంటావా, దిక్కులేనిదాన్ని చేస్తాడా?' అలా ప్రారంభమైన ఆమె భయం వుత్తరాల ద్వారా షాక్ కొడ్తుంటుంది నన్ను 'వదిలేస్తాడేమో యెలా బతకాలి! యిదే ఆలోచన దొలిచేస్తోంది. జలగలా పీల్చేసే భయం వంటచేసి అలసి నిద్రపోదామంటే కంటిమీది కునుకుని కూడా ఛెళ్లనిపించే భయం' . . . . .

గతకాలపు ప్రేమికుడా! నీ స్వప్నసుందరికి పిచ్చెక్కింది' నా కంఠంలో వెటకారం అతనిని ఎలా తాకింది? అసలు తాకిందా? యిప్పుడు కేబుల్ ఆపరేటరుగా జీవితాన్ని వెళ్లబుచ్చుతున్న అతడు ఊరికే రిమోట్ కంట్రోల్ని నొక్కుతున్నాడు. తెర మీది బొమ్మలు వేగంగా మారుతున్నాయి. భరతనాట్యం, పాప్ మ్యూజిక్, సాహసాలు, ముద్దులు, గాఢాలింగనాలు అతని ముఖంలోని మార్పుల్ని పసిగట్టకుండా దారి మళ్లించడానికా అన్నట్టు యీ రంగుల క్షుద్ర ప్రపంచం.

'నీ వల్లనే ఆమె పిచ్చిదైంది'

'అబద్ధం. ఆమె జీవితం ఆమెది. ఏదో తెలిసీ తెలియనివయస్సులో యేదీ ప్రాక్టికల్‌గా ఆలోచించలేని రోజుల్లో అంతా నాన్సెన్స్. బతకాలంతే'

'నువ్వు గతాన్ని పూర్తిగా తుడిచెయ్యలేవు. ఆమెకి నువ్వు రాసిన వుత్తరాల్ని పూర్తిగా మరచిపోయావా? ఏమని సంబోధించాలో తెలియక సంబోధనా రహితంగానే రాస్తున్నానని మొదటి వుత్తరంలో రాశావు. ఆ లేఖకి ఆమె చేతులు వణకడం యింకా గుర్తు 'అతనంటేనీ కిష్టమేనా?' అడిగానామెని.

'ఆ... అంటే.... అదే నాకూ తెలీదు.' బూజుపట్టినదేవుడి పటాలు వేళ్లాడ్తున్న ఆ శిథిలగృహపు గోడల మధ్య ఆమె తన యిష్టాన్ని కాని అయిష్టాన్ని కాని ఎలా నిస్సందేహంగా ప్రకటించగలదు మానవ నిర్ణయం ఎలా రూపుదిద్దుకోగలదు?

'నేను చాలా ఆనందంగా వున్నాను. మరో వైపు దిగులుగా కూడా. ఏ సంగతినైనా నేనోఅతడో యెలా నిర్ణయించుకోగలం? అమ్మా, నాన్నా, సంఘం, విధి' నిర్ణయించుకొనే బాధ్యత నుంచి బ్రాహ్మణ సహజ స్వభావంతో తప్పించుకోవాలని చూస్తోందని గ్రహించాను. అప్పట్లో నువ్వూ అంతే. సరే ఏమైనా ఆమె నిర్ణయాన్ని వాయిదా వేసింది. చివరికి నీ ప్రేమకి లొంగిపోయింది. ఉత్తరాలు రాసింది. ప్రేమ యేరులై పారింది. కాని మీరు ఎవరిదారిన వారు పెళ్లి చేసుకొని స్థిరపడిపోయారు నేను యీ గడిచిపోయిన గోలంతా యేకరువు పెట్టాను. అతనేటూ తప్పించుకు పారిపోకుండా మీరు కలిసి జీవించగలిగితే ఎలా వుండేవారు? ఆమె పిచ్చిదయ్యేదా? మీ జీవితం రోజురోజు వికసించేదా?'

'ఆ గోలంతా ఎందుకిప్పుడు?' అతడు కిటికీలోంచి పొగవదుల్తూ అన్నాడు. ఔను ఎందుకు? అతని ముఖం కనిపించడం లేదు. క్షణం మౌనం తర్వాత సిగరెట్ పీకని కాలితో గట్టిగా... అంత గట్టిగా అవసరమా? గోడమీది సాలెగూడు అతనిలోంచే అల్లుకున్నట్టనిపించింది.

'నేను వెళ్తున్నాను' సరే ముభావంగా అన్నాడు,ముక్కం నా వైపు తిప్పకుండానే.

వొక పురుగు పండుని లోపలి నుంచి దొలిచెయ్యడం. కుళ్లి పోవడం కాదు, లోపల యేమీ లేకపోవడం. ప్రస్తుతం ఆమె స్థితి అదా?

యిటీవల కలిశానామెని 'నువ్వూ మీ ఆయనా బాగున్నారా? పిల్లలూ?' అని అడిగింది.

'మాకు అమ్మాయి'

'అమ్మాయా? దేవుణ్ణి భక్తితో కొలు. అమ్మాయికి కూడా భక్తి నేర్పు.'

'దేవుడు చచ్చిపోయాడు. స్లీపింగ్ పిల్స్ మింగి...'

'వొద్దు అలా మాట్లాడకు లెంపలు వేసుకో. శాంతి శాంతి అది కావాలి మనకి. దైవ భక్తిలోనే అది దొరుకుతుంది'


'నిన్నేం రక్షించాడు దేవుడు?'

నేనిలా మిగిలానంటే ఆమె మాటలకి హఠాత్తుగా గండి పడింది. ముఖంలో నీలి నీడలు. కన్నీళ్లంటే ధారాపాతమయ్యేవి.

దైవకృపవల్ల ఆమె ఎలా మిగిలిందంటే, అతని గురించి యేమీ అడగలేదు. తర్వాత కలిసినప్పుడు ఎప్పుడూ అతని గురించి, గతాన్ని గురించి పలవరించలేదు. ఆమె ఎలా మిగిలింది? ఆ ప్రవాహంలా కాదు యీ బ్రిడ్జిలా కాదు. ఏ వస్తువుల్నీ యిముడ్చుకోలేక ఆయాసపడ్తున్న నిస్తేజమైన ఆ యిరుకు గది గోడమీది దుమ్ము పట్టిన దేవత పటం లాగే వుందామె.

'సర్దుకుపోవాలి తెలిసిందా సర్దుకుపోవాలి. ఆడపిల్ల తండ్రినంటున్నావ్ గుర్తుంచుకో. యేమీ లేదు. అంతా భగవంతుడు చూసుకొంటాడు. అన్నట్టు యీ రోజు శనివారం వెంకటేశ్వర సుప్రభాతం ఆడియో క్యాసెట్ ఆన్ చేసిందామె.

ఆమె ముఖంలో నిశ్చలత నిర్లిప్తత, పూర్వపు మొహం కాదది. వేగంగా మారే భావాలేం లేవు. మాస్క్ తగిలించుకొందా, ట్రాంక్విలైజర్స్ మహిమా? ఎక్కడి నుంచి, ఎలాంటి ప్రశాంతి అది? వొకొక్కసారి రోగం కన్న దాని నుంచి కోలుకోడమే ఘోరంగా విషాదకరంగా వుంటుంది.



## అతిచిన్న వయొలిన్

ప్రపంచంలోని అత్యంత చిన్న వయొలిన్ ఇది. అంగుళంన్నర కన్నా తక్కువ పొడవు గల దీన్ని వాయించవచ్చు. రెండు తీగలు గల ఈ వయొలిన్ను 29 ఏళ్ళ కోర్నెల్ ష్నైడర్ అనే వ్యక్తి 70 గంటలు వెచ్చించి తయారుచేశాడు. స్విట్జర్లాండ్‌కు చెందిన ఇతను దీన్ని ఓ వేలంలో 1695 డాలర్లకి (51,000 రూపాయలు) అమ్మాడు.

—ఎం.లిపి